క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి , నందీశ్వరునికి, కుమారస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి, వీరభద్ర స్వామికి, కుమారస్వామికి విశేష పూజలు నిర్వహించారు.

8న సామూహిక వరలక్ష్మీ వ్రతం



వివరాలు వెల్లడిస్తున్న ఈఓ, వేదపండితులు

మహానంది: ఈనెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు మహానంది దేవస్థానం ఈఓ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. మంగళవారం కార్యాలయంలో వారు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతంలో పాల్గొనే మహిళలకు నంద్యాలకు చెందిన ఏజీఎస్ జువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, సరస్వతి దంపతుల సహకారంతో పూజా సామగ్రి, ప్రసాదాలు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏఈఓ ఎరమల మధు, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలో పార్కు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కో ఆప్షన్ మెంబర్ రషీద్‌లకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్ మాట్లాడుతూ శారీరక, మానసికంగా అలసిపోయిన పట్టణ వాసులకు ఆహ్లాదం కోసం పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, గణపతి, సామేలు, రైట్ బాషా, చాంద్, ముర్తుజావలి, ఫారూక్, సలీం, మౌలాలి ఉన్నారు.

తల్లి పాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాంతిరాం మెడికల్ కాలేజ్ విద్యార్థినులు

బండి ఆత్మకూరు: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో శాంతిరామ్ మెడికల్ కాలేజీ విద్యార్థినులు లఘునాటిక ద్వారా ప్రజలకు అవాగాహన కల్పించారు. తల్లిపాలలో విటమిన్లు పుష్కలంగా ఉండి బిడ్డ ఎదుగుదలకు తోడ్పాడతాయని, ముర్రు పాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని నాటిక ద్వారా తెలియజేశారు.

పారిశుధ్య పనులు



కాలనీలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో అధికారులు మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల ఎస్సీ కాలనీలో పలువురు విషజ్వరాల బారిన పడటంతో వారం రోజులుగా వైద్యాధికారులు ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. ఈక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌అల్లాంబాషా ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి చిన్నస్వామి సిబ్బందితో కాలనీలో పారిశుధ్య పనులు చేయించారు. బావుల వద్ద పిచ్చి మొక్కల తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధుల్లో వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. కొత్తపల్లి వైద్యాధికారి మహమ్మద్‌బేగ్ కాలనీని సందర్శించి పరిశుభ్ర చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

స్మార్ట్ మీటర్ల భారం మోపొద్దు



జూపాడుబంగ్లా విద్యుత్ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

జూపాడుబంగ్లా: స్మార్ట్ మీటర్ల భారం మోపొద్దని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రమేష్‌బాబు, సీపీఎం మండల కార్యదర్శి కర్ల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ మంగళవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు యత్నించిన అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వ్యతిరేకించారన్నారు. అమర్చిన స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని చంద్రబాబు నాయుడు ప్రజలను రెచ్చగొట్టారన్నారు. ఇప్పుడేమో అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అదానితో కుదుర్చుకున్న ఒప్పందం రద్దు చేసుకుని ప్రజలపై స్మార్ట్‌మీటర్ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనియెడలా ప్రజలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, శివ, దేవరాజు, శివన్న, మగ్బుల్‌బాషా, మనోహర్, శీను, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని, బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించి పాత మీటర్లు అమర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కిర్‌సాహెబ్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక 11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాక ముందు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసి ప్రజలపై పెనుభారం మోపడం తగదన్నారు. ట్రూఅప్ చార్జీలు, ఇంధనపు సర్దుబాటు చార్జీలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గంధం ఉసేనమ్మ, చాంద్‌బాషా, ఈశ్వరమ్మ, కలాం, తిక్కస్వామి, అచ్చన్న, వెంకటేశ్వర్లు, మరియమ్మ, యూసుఫ్‌బాషా, నాగలక్ష్మమ్మ, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలి

నందికొట్కూరు: విద్యుత్ చార్జీల నిలువు దోపిడీని ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరరావు కోరారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లుల భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదానితో చేసుకున్న సెకి ఒప్పందాలను కొనసాగించడం విచారకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ.2,787 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఖర్చును వినియోదారులపై వేయడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉస్మాన్‌బాషా, బాబు, జయరాణి, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, డేవిడ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

● సన్మానం



పగిడ్యాల: మండలంలోని తూర్పు ప్రాతకోట ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి క్రిష్ణమూర్తి బదిలీపై వెళ్తున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు తదితరులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడ వీధులలోని నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.అరుణ, బృందం వారి భక్తిరంజని కార్యక్రమం ఆకట్టుకుంది. శరణు సిద్ధివినాయక, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవస్తోత్రం, కాలభైరవాష్టకం, పలు శివకీర్తనలను అరుణ, శ్రీరామకష్ణ, అతిథి తదితరులు ఆలపించారు. కార్యక్రమానికి తబల సహకారాన్ని శంకరరావు, వయోలిన్ సహకారాన్ని అర్జున్ అందించారు..

సమయానికి బస్సులు నడపాలి



కేజీ రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

జూపాడుబంగ్లా: పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సులు నడపాలని మంగళవారం కేజీ రోడ్డుపై ధర్నాకు దిగారు. మండ్లెం గ్రామం నుంచి సుమారు 150 మంది విద్యార్థులు నందికొట్కూరు, జూపాడు బంగ్లా, కర్నూలు ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. వీరు ప్రతి నెలా నందికొట్కూరు డిపోలో పాస్ తీసుకుంటూ ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఆత్మకూరు డిపోలో బస్సు పాసులు తీసుకోలేదనే ఉద్దేశంతో ఆ డిపో ఆర్టీసి బస్సులు మండ్లెంలో నిలపకుండానే వెళ్తున్నారని పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో తాము సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేక తరగతులు కోల్పోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆత్మకూరు డిపో బస్సులు మండ్లెం గ్రామంలో నిలపాలని, అలాగే తొలగించిన నందికొట్కూరు డిపో విద్యార్థి బస్సును పునురద్ధరించాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు మండ్లెం గ్రామానికి చేరుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, డిపో మేనేజర్‌తో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: మనమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో సచివాలయాల ఉద్యోగులతో కలిసి ప్రజల చేతిలో ప్రభుత్వం (మన మిత్ర)పై ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం వాట్సాప్ నంబరు 9552300009ను సేవ్ చేసుకుని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, 200 సేవలు పొందాలని సూచించారు.

● **జూపాడుబంగ్లా:** మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూపరింటెండెంట్ మధుసూదన్, సీనియర్ అసిస్టెంటు మద్దమ్మ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో మన మిత్రయాప్‌పై విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ 9552300009 నంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌కు హాయ్ అని మెసేజ్ పంపిస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న 200 సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

● **పాములపాడు:** ప్రతి ఒక్కరూ మన మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మేకల భాగ్యమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో మన మిత్ర యాప్‌పై ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ వాట్సాప్ నంబరు 9552300009 గురించి అవగాహన కల్పించారు.

సమస్యలపై చర్చ



మాట్లాడుతున్న మస్తానయ్య

వెలుగోడు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినూత్న కార్యక్రమం చేపట్టింది. 'రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం' పేరుతో మంగళవారం స్థానిక తెలుగుగంగ ప్రాజెక్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సంఘం ఆత్మకూరు తాలూకా అధ్యక్షుడు కల్లూరి పెద్ద మస్తానయ్య హాజరై ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. వెలుగోడు తెలుగు గంగ ప్రాజెక్ట్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెలుగోడు తెలుగుగంగ ప్రాజెక్ట్ ఉద్యోగులు హుస్సేన్‌బాషా, సీనియర్ అసిస్టెంట్, మధు తదితరులు పాల్గొన్నారు

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షులు నర్సరాజు

నందికొట్కూరు: ఉద్యోగులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షులు నర్సరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక, ఆర్థికేతర సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పష్టమైన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. సీనియర్ ఏఎస్ఎంలను దూరప్రాంతాల్లో విధులు నిర్వహించాలని ఒత్తిడి చేయడం సబబు కాదన్నారు. ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లోని డీఏలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ వీఆర్వో అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు మౌలిబాషా మాట్లాడుతూ రేషన్‌లైజేషన్‌లో వీఆర్వోలకు సంబంధం లేకుండా ప్రతి గ్రామంలో వీఆర్వోలను కొనసాగించాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారుల పదోన్నతుల రేషియోను 80:20కి పెంచాలని, వన్‌టైం సెటిల్‌మెంట్ చేసి సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ ఖాళీలను వీఆర్వోలతో భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి భువనేశ్వరి, కోశాధికారి రాముడు, ఉపాధ్యక్షులు మద్దిలేటి, నూరుల్లా, కృష్ణమూర్తి, సభ్యులు నాగేశ్వరమ్మ, మహబూబ్‌బాషా, రాజశేఖర్, జ్యోతి పాల్గొన్నారు.

పైర్లను కాపాడాలి

కొత్తపల్లి: సాగు నీరు విడుదల చేసి పైర్లను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ స్వాములు, నాయకుడు కె.దినేష్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ పదిహేను రోజుల నుంచి వర్షాలు లేకపోవడం, కృష్ణాజలాలు, ఎత్తిపోతల పథకాలు ఉన్నా అధికారులు లిఫ్ట్ ద్వారా నీళ్లు వదలకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయన్నారు. శివపురం నుంచి సింగరాజు పల్లె వరకు మాత్రమే లిఫ్ట్ ఇరిగేషన్ నీళ్లు అందించి మిగతా గ్రామాల రైతులకు ఇవ్వకపోవడం తగదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల సీనియర్ స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు సాధించాలి

నంద్యాల: జాబ్ మేళా ద్వారా యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోవెలకుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 12న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 9182217075, 9951400588 నంబర్లకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాజా మహేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● నిర్లక్ష్యం పారుతోంది!

జాతీయ రహదారి 340సీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతక తిలోదకాలిచ్చినట్లు స్పష్టమవుతోంది. తాటిపాడుకు వెళ్లే దారిలో నిర్మించిన అండర్‌పాస్ వంతెనే నిలువెత్తు సాక్ష్యం. నాణ్యతను గాలికొదిలి నాసిరకంగా నిర్మించటంతో సోమవారం ఉదయం కురిసిన చిన్నపాటి వర్షానికే వంతెనకు ఏర్పడిన బీటల నుంచి వర్షం నీరు పారుతోంది. హైవే రోడ్డు నిర్మాణ పనుల నాణ్యతను పర్యవేక్షించే అధికారులకు ఇలాంటివి కనిపించకపోవడం సిగ్గుచేటని పలువురు విమర్శిస్తున్నారు. – జూపాడుబంగ్లా



లీక్ అవుతున్న వర్షపు నీరు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్మిక సంక్షేమ కార్యాలయంలో లేబర్ ఆఫీసర్ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్నారు. కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసి కార్పొరేటర్లకు ఊడిగం చేయడం సిగ్గు చేటన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగార్చడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సోమన్న, సుధాకర్, షేక్షావలి, ఆంజనేయులు, దేవదానం, ఏసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలి



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న జయదేవానంద

కోవెలకుంట్ల: పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు చదివి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచారకులు జయదేవానంద సూచించారు. మంగళవారం మండలంలోని రేవనూరులో టీటీడీ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని కథా శ్రవణము మానవులను దు:ఖరహితులను చేసి ఉత్తమ గతులను ప్రాప్తింప చేస్తుందన్నారు. వేదాలు పఠించడం వల్ల ఉత్తమ మార్గం వైపు పయనించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, భజనమండలి సభ్యులు వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, ఉసేనయ్య, నాగమలేశ్వరరెడ్డి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు ఇవ్వాలి

నందికొట్కూరు: సాగు నీరు విడుదల చేసి నాగటూరు ఎత్తిపోతల పథకం కింద ఎండిపోతున్న పైర్లను కాపాడాలని వ్యవసాయ సంఘం నాయకులు ఫక్కిర్ సాహెబ్ కోరారు. మంగళవారం ఆయన రైతులతో కలిసి పైర్లను పరిశీలించారు. నాగటూరు ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేయించి 10 వేల ఎకరాలకు సాగునీరు అందించాలన్నారు. ఆగస్టు నెల వచ్చినా ఎత్తిపోతల పథకం నీరు పారకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతుల దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు.



ఎండుతున్న మొక్కజొన్న పంటలను చూపుతున్న నాయకులు

తొలిదశలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి విముక్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): తొలి దశలో గుర్తించి చికిత్స తీసుకుంటే క్యాన్సర్ నుంచి విముక్తి పొందవచ్చని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ చెప్పారు. మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎన్‌సీడీ 4.ఓ లో భాగంగా క్యాన్సర్ వ్యాధిపై సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే స్త్రీ వ్యాధినిపుణులకు, దంత వైద్య నిపుణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఈ వ్యాధి భారిన పడకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, తగిన శారీరక శ్రమ లేకపోవడం కారణంగా రోజు రోజుకూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరిగిపోతోందన్నారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్ మాట్లాడుతూ.. క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి లక్షణాలున్న వారిని కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళవారం, గురువారం ఓపీ నంబర్ 222కు రెఫర్ చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై అపోహలు తొలగించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌పీఎం హెచ్‌ఓడీ డాక్టర్ సుధారాణి, వైద్యాధికారులు సింధియా శుభప్రద, మహేశ్వరప్రసాద్, వెంకటసుబ్బనాగరాజు, సాయిమాధురి, బిందుమాధవి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్ఐ జయశేఖర్

కొత్తపల్లి: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ జయశేఖర్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక రాజరాజేశ్వరి హైస్కూల్‌లో కరస్పాండెంట్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠాల పట్ల శ్రద్ధ చూపాలన్నారు. డ్రగ్స్, గంజాయి, చుట్టా, బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ, పాన్‌పారక్ వంటి చెడు అలవాట్ల జోలికి వెళ్లరాదన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోరాదన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 100కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

పెద్దాసుపత్రికి స్ట్రెచర్ల విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పలువురు దాతలు ఇచ్చిన 20 స్ట్రెచర్లను మంత్రి టీజీ భరత్ మంగళవారం తన జన్మదినం సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కిమ్స్ హాస్పిటల్, ఒమెగా హాస్పిటల్, కేఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం వారు ఐదు స్ట్రెచ్చర్ల చొప్పున విరాళంగా ఇచ్చారు. త్వరలో మరో 10 స్ట్రెచర్లను కేఎంసీ విద్యార్థులు అందించనున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, డాక్టర్ కుమారస్వామిరెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: జిల్లా స్థాయి కుస్తీ, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపిన జూపాడుబంగ్లా గురుకుల పాఠశాల విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లా జూడో అసోసియేషన్ సెలెక్షన్ ట్రయల్స్ సబ్‌జూనియర్ కేటగిరిలో ఖలీల్‌బాషా, రాంచరణ్, సంతోష్, పి.జగన్, టి.యనోక్, ఆకాశ్ ప్రతిభ చూపి ఈనెల 8, 9 తేదీల్లో మంగళగిరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. అథ్లెటిక్స్‌లో ఎన్.విజయ్ 60 మీటర్ల స్పీడ్ రన్నింగ్, క్రీస్తురాజు హైజంప్‌లో ప్రతిభ చూపి బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రెండు రోజుల క్రితం నంద్యాల గుడ్‌షపర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన బాల్‌బాడ్మింటన్ జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో శాంతరాజు, రాజన్న, రేవంత్ ప్రతిభ చాటి ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలి



జూపాడుబంగ్లా: 80బన్నూరులో మొక్కజొన్న పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

నందికొట్కూరు: భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని కొణిదేల, నాగటూరు గ్రామాల పొలిమేరలో రైతులకు మంగళవారం పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట విత్తనం వేసేటప్పుడు విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. పంటలో కాండం తొలిచే పురుగును నివారించేందుకు రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

● **జూపాడుబంగ్లా:** మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. 80బన్నూరు, పోతులపాడు గ్రామాల్లో మొక్కజొన్న పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూసాంద్రతను బట్టి ఎరువులను వేసుకోవాలన్నారు. యూరియా సరఫరా తక్కువగా ఉన్నందున ప్రత్యామ్నాయంగా నానో యూరియాను పిచికారీ చేసుకోవచ్చన్నారు.

● **మహానంది:** పది సెంట్ల కంటే తక్కువ పొలం ఉందేవారితో పాటు 18ఏళ్ల లోపు ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించదని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. బొల్లవరం, తమ్మడపల్లె గ్రామాల్లో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎన్‌పీసీఐ ఇన్ ఆక్టివ్ ఉన్నవారు, మ్యాపింగ్ లేనివారు బ్యాంకులకు వెళ్లి లింక్ చేసుకోవాలన్నారు. పొలం లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ రైతులు కౌలుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

● **బండి ఆత్మకూరు:** వ్యసాయంతోపాటు పాడి పశువులను పెంచుకోవడ లాభదాయకమని మండల వ్యవసాయ అధికారి ఆర్ పవన్‌కుమార్ సూచించారు. చిన్నదేవలాపురం, నారాయణపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి రైతులకు పలు సూచనలు చేశారు.